క్లుప్తంగా

రూ.98 లక్షలతో మంచినీటి పథక పనులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎన్టీఆర్ కాలనీలో జల జీవన్ మిషన్ నిధులు రూ.98 లక్షలతో మంచి నీటి పథక పనులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంక్ కాంక్రీట్ పనులను సోమవారం నిర్వహించారు. 60 వేల లీటర్ల కెపాసిటీతో ఈ పథకాన్ని నిర్మిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ తెలిపారు.

రీసర్వేకు వినతుల వెల్లువ



గుడ్లవల్లేరు: రీసర్వేకు రైతుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని విన్నకోటలో రీసర్వే గ్రామసభను సోమవారం నిర్వహించారు. ఈ సభలో సబ్ డివిజన్ చేసేందుకు 15 మంది రైతుల నుంచి వినతిని సమర్పించారని మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా తెలిపారు. రీసర్వే డీటీ రత్నకుమారి మాట్లాడుతూ రీసర్వేలో రైతుల అభ్యంతరాలను స్వీకరించటంతో పాటు ఆ అభ్యంతరాల్లోని సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

కార్నియాల సేకరణ

గుడివాడ టౌన్: నేత్రదానం మరో వ్యక్తికి జీవితం ప్రసాదిస్తుందని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ కోశాధికారి జి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పట్టణానికి చెందిన తుమ్మల శ్రీనివాసరావు మృతి అనంతరం కుటుంబ సభ్యుల అనుమతితో కార్నియాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. సేకరించిన కార్నియాలను విజయవాడకు చెందిన ఎల్‌బీ ప్రసాదు కంటి ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎనిమిది మందికి ఉద్యోగాలు



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కృష్ణా జిల్లా శాఖ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎనిమిది మందికి ఉద్యోగాలు లభించినట్లు గుడివాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి అధికారి డి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 16 మంది విద్యార్థులు హాజరుకాగా ఎనిమిది మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ఆమె పేర్కొన్నారు. కళాశాల టీపీఓ జయరామ్, ఆనంద వేణుగోపాల్, కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పామర్రు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను సోమవారం పద్మశ్రీ ఘంటసాల స్మారక కళాపీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ సత్ప్రవర్తన–ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. విజేతలైన వారికి ఈనెల 13వ తేదీన బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇందిరారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ ఏర్పాటు చేయాలి



దేశిగుంట వద్ద రైల్వే గేట్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

మండవల్లి: దేశిగుంట ప్రాంతంలోని కండిగ పొలాల వద్ద రైల్వేగేట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండవల్లి పల్లపు బజార్ సమీపంలోని దేశిగుంట మీదుగా భీమవరం, విజయవాడ రైల్వే ట్రాక్ ఉంది. ఈ ట్రాక్‌పై విజయవాడ, భీమవరం, గుడివాడ తదితర పట్టణాలకు రైళ్లు వెళుతుంటాయి. ఇక్కడే నుంచి సింగనపూడి తదితర గ్రామాల ప్రజలు మండవల్లికి వస్తుంటారు. దేశిగుంట ప్రాంతంలోని కండిగ అని పిలువబడే పొలాలు ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు, పశువుల పాకల వద్దకు రైల్వే ట్రాక్ దాటి వెళుతుంటారు. ఈ ప్రాంతంలో రైల్వేగేట్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ట్రాక్‌పై రైల్వేగేట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

తోట్లవల్లూరు మండలంలో కూటమి నాయకులు ఇసుక మాఫియాకు తెర తీశారు. ప్రభుత్వ నిబంధనలను అడ్డం పెట్టుకుని ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుకను ఎక్కడైనా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై స్వేచ్ఛగా తీసుకెళ్లవచ్చని తమ అధినేత, సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన కూటమి నేతల పాలిట వరంలా మారింది.



భద్రిరాజుపాలెంలో ఇసుకను ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రవాణా చేస్తున్న దృశ్యం

ఇసుక మాఫియా

అడ్డగోలుగా దోచుకుంటున్న కూటమి నాయకులు

పామర్రు(తోట్లవల్లూరు): ఇసుక క్వారీల్లో సేవ చేస్తున్నామంటూ బాట ఖర్చు పేరిట ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున అడ్డగోలుగా కూటమి నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏవిధమైన బాటలు వేయని కారణంగా ఆయా ప్రాంతాల్లో ట్రాక్టర్లు తిరగబడి పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇసుక అక్రమ రవాణా రూ. కోట్లలో జరుగుతున్నా స్థానిక అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

కూటమి నాయకులకు ఇసుక అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఇసుకను ఎడ్ల బండ్లతో పాటుగా ట్రాక్టర్లలో కూడా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కూటమి నాయకులు అక్రమ ఇసుక రవాణాకు తెగబడుతున్నారు. ఉచిత ఇసుక పథకాన్ని సొమ్ము చేసుకోవడం కోసం అధికార పార్టీ శ్రేణులు తయారవుతున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో రవాణా చేసుకుని ఓ ప్రాంతంలో డంప్ చేసుకుంటున్నారు. అన్‌సీజన్‌లో ఇదే ఇసుకను ఒక ట్రాక్టర్ వేల రూపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఇసుకను డంప్ చేస్తున్నారు.



చాగంటిపాడులో ఇసుక రవాణా క్వారీ వద్ద లోడింగ్‌కు ఉన్న ట్రాక్టర్లు

నిబంధనలు కూటమి నాయకులకు వర్తించవా?

గతంలో మండల పరిధి కళ్లంవారిపాలెం క్వారీలో ఓ నాయకుడు ఇసుక మాఫియా నిర్వహిస్తున్నారని ఆరోపణలు రావటంతో ఆ క్వారీని స్థానిక అధికారులు మూసి వేశారు. అయితే అదే మండలంలో చాగంటిపాడు, భద్రిరాజుపాలెం క్వారీల్లో ప్రస్తుతం అంతకు మించి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోక పోవడం పలు అనుమానాలను దారి తీస్తోంది. చాగంటిపాడులో ఇసుక పోసి కార్మికులు ఒక ట్రాక్టర్‌కు రూ.1,000 వసూలు చేస్తున్నారు. అదే క్వారీ వద్ద కూటమి నాయకులు ప్రతి ట్రాక్టర్‌కు బాట ఖర్చులు అంటూ రూ.200 అడ్డగోలుగా దోచేస్తున్నారు.

తిలా పాపం.. తలా పిడికెడు

క్వారీల్లో అధికార పార్టీ నేతలు బాట ఖర్చుల పేరుతో వసూలు చేస్తున్న డబ్బును మండల స్థాయి రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఇచ్చి మిగిలినది క్వారీ నిర్వాహకులు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు అక్రమ వసూళ్లు చేసే క్వారీలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఐలూరులో ఉచిత ఇసుక తవ్వకాలు జరుగుతుండగా ఓ భూస్వామి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లకుండా తన కారుని రహదారికి అడ్డంగా పెట్టడంపై ఈ నెల 6వ తేదీన ఎస్సీలు ఆందోళన కూడా నిర్వహించారు.

మాకేం సంబంధం లేదు

ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం ఉచిత ఇసుకపై జోక్యం చేసుకోలేం. ఉచిత ఇసుక క్వారీలు ఎక్కడా లేవు. రొయ్యూరులో రెండు, నార్త్ వల్లూరులో మూడు క్వారీలకు మాత్రమే అధికారికంగా అనుమతులు ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ తవ్వకాలు జరగడం లేదు. మిగిలిన చోట్ల ఉచిత ఇసుక తవ్వకాలు జరిగితే మేము ఏమీ చేయలేం.

– కుసుమకుమారి, తహసీల్దార్, తోట్లవల్లూరు

దూళ్లవానిగూడెంలో ఉద్రిక్తత



గేట్ బేస్‌మెంట్‌ను పగులగొడుతున్న రెవెన్యూ సిబ్బంది



అధికారులను ప్రశ్నిస్తున్న బాధితులు

పాములపాడు (పెదపారుపూడి): పాములపాడు పంచాయతీ దూళ్లవానిగూడెంలో పంచాయతీ గ్రామకంఠలో భూమిలో అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టారంటూ తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ టీ. సీతామహాలక్ష్మి, ఎస్ఐ ప్రవీణకుమార్‌రెడ్డి సమక్షంలో ఓ కుటుంబానికి చెందిన గేటు బేస్‌మెంట్‌ను పగులగొట్టడంతో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకుంది. గ్రామంలో రీసర్వే నంబర్ 728లో రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు రావటంతో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసుల సమక్షంలో గేటు కోసం వేసిన బేసిమెంట్‌ను పగులగొట్టారు. దీంతో గ్రామానికి చెందిన పల్లి విజయకుమారి, కుటుంబ సభ్యులతో వచ్చి 40 సంవత్సరాలుగా ఉంటున్న తమ స్థలంలో ఇంటికి వెళ్లి దారిలో గేటు నిర్మాణ పనులు చేస్తే వచ్చిన ఇబ్బంది ఏమిటి అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. టీడీపీ నాయకుల మాటలు విని తమకు అన్యాయం చేస్తారా అని నిలదీసింది. ఎంతో కాలం నుంచి తాము దారిగా వాడే స్థలం మీకు గ్రామ కంఠం భూమిగా మారిందా అని ఆవేదన వ్యక్తం చేసింది. తమ ఇంటికి వచ్చి నోటీస్ అంటించిన రెండో రోజే గేటు పగులగొడతారా అని బోరున విలపించింది.

డ్రెయిన్‌కు మరమ్మతులు



నాడు: తూడుతో పూడుకుపోయిన డ్రెయిన్



నేడు: డ్రెయిన్‌లో పూడిక తీసిన దృశ్యం

కైకలూరు: జాతీయ రహదారి సమీప టౌన్ హాలు వద్ద డ్రెయిన్ తుప్పలు, తూడుతో పూడుకుపోయింది. దీంతో మురికినీటి పారుదలకు అడ్డంకిగా మారింది. ఈ సమస్యపై 'పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికతో సాక్షిలో ఆదివారం కథనం వెలువడింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయిన్‌కు మరమ్మతులు చేపట్టి తూడు, పూడిక తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్

సంక్షిప్త వార్తలు

నేడు గోవుల అందాల పోటీలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత, గ్రామాభివృద్ధి సంఘం కార్తిక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం గోవుల అందాల పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సోమవారం ఆ సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు ప్రకటించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థులకు రోజ్‌మిల్క్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నెహ్రూనగర్ డ్రెయిన్‌పై జంగిల్ క్లియరెన్స్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నెహ్రూనగర్ మురుగ కాల్వపై ఇరువైపులా పిచ్చి మొక్కలు వర్షాల్లో చిట్టడవిలా పెరిగిపోయి కమ్మేశాయి. ఈ జంగిల్‌ను గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు తమ పారిశుద్ధ్య కార్మికులతో సోమవారం క్లియరెన్స్ చేయించే పనులను చేపట్టారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా మురళి



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కుంచపర్తి మురళి ఎన్నికయ్యారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి మురళీకి సోమవారం బాధ్యతలు అప్పగించి, శాలువాతో సన్మానించారు. ఉపాధ్యక్షుడిగా ఆలమూరి ప్రసాదరావు, కార్యదర్శిగా ఊటుకూరి బాల సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా బెజవాడ వెంకట శ్రీనివాసరరావు, కోశాధికారిగా హేమంత్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌తో ఆహ్లాదం.. ఆరోగ్యం

గుడ్లవల్లేరు: క్లీన్ అండ్ గ్రీన్‌తో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం లభిస్తుందని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్ పరిసరాలతో పాటు పెంజెంద్ర రోడ్డులో ఇరువైపులా జంగిల్ క్లియిరెన్స్‌ను సోమవారం చేయించారు. లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, స్థానిక క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులుగా వరలక్ష్మి, నరేంద్ర





గుడ్లవల్లేరు: యూటీఎఫ్ కృష్ణా జిల్లా నూతన కార్యదర్శులుగా ఎ.వి.వరలక్ష్మి(గుడ్లవల్లేరు ఎంపీపీఎస్), లంకా నరేంద్ర (విన్నకోట జెడ్పీహెచ్‌ఎస్) ఎన్నికయ్యారు. స్వర్ణోత్సవం సందర్భంగా గన్నవరంలో రెండు రోజులుగా జరుగుతున్న తమ జిల్లా ఫెడరేషన్ సమావేశంలో నూతన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ప్రకటించారని జిల్లా కార్యదర్శులు వరలక్ష్మి, నరేంద్ర సోమవారం తెలిపారు.

క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

గుడివాడ టౌన్: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని ఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ ఆనంద్ కుమార్ కోరారు. సోమవరం స్థానిక లింగవరం రోడ్‌లోని రివైవల్ పెంతుకోస్తు చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ డిమాండ్ ప్రభుత్వానికి తెలియజేసేందుకు 10 లక్షల సంతకాలు సేకరిస్తున్నామన్నారు. జాతీయ కోశాధికారి కె.శాంతిసాగర్, సెక్రటరీ ఏలియా, సభ్యులు వరప్రసాద్, శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు: బాలలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎస్.వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం హైస్కూల్లో ఆయన సోమవారం బాలలపై జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహనసదస్సును చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ

ఈ నెల 21న ఎన్నికలు

గుడ్లవల్లేరు: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 21 తేదీన ఎన్నికలకు రంగం సిద్ధమవుతుంది. 20న తుది సాగునీటి సంఘాల ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేయనున్నారు. మండలంలోని ఆయా కాల్వలపై సర్వే నంబర్లు ఉన్నాయనే విషయంపై ఆయా ప్రాంతాల పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో సమాచారాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఎన్నికల్లో విజేతలు ఇలా..

సాగునీటి సంఘాల్లో గెలుపొందిన వారు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. మండలంలో 99 ప్రాదేశిక సంఘాల ఎన్నికలను ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నారు.

ఓటర్లుగా అర్హులు వీరే..

సాగునీటి సంఘాల ఎన్నికల్లో మండలంలోని సాగునీటి, పంట కాల్వల ఆయకట్టు కింద సాగవుతున్న వ్యవసాయ భూముల రైతులను ఓటర్లుగా చేరుస్తున్నారు. 18ఏళ్ల నిండి, పంట పొలాలకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం లేదా రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న రైతులు, అగ్రిమెంట్ లీజు డాక్యుమెంట్లు ఉన్న కౌలుదారులు, చెరువులు కలిగి ఉండే ఆక్వా రైతులను కూడా ఓటర్లుగా నమోదు చేయనున్నారు.

ఓటర్ల జాబితానే కీలకం



ఓటర్ల జాబితా తయారీనే కీలకం. ఆ జాబితాల తయారీనే మా బాధ్యత. ఆ తర్వాత ఇరిగేషన్ అధికారులదే బాధ్యత. కాల్వల కింద ఆయకట్టుల్లో సర్వే నంబర్లను ఇరిగేషన్ శాఖ వారు మాకు అందించారు. వాటి ఆధారంగానే రైతులను పరిశీలించి జాబితాలను తయారు చేసి ఇస్తున్నాం. అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాలను కూడా అందిస్తాం.

– బి.లోకరాజు, గుడ్లవల్లేరు తహసీల్దార్

రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

గుడివాడరూరల్: పట్టణంలోని భీమవరం రైల్వేగేట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఏర్పడిన ట్రాఫిక్ సమస్య, వాహనదారుల ఇబ్బందులపై ఈ నెల 9వ తేదీన సాక్షి పత్రికలో 'గేటుపడితే నరకమే' అని ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు రైల్వేగేట్ల వద్ద సమస్యను స్వయంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం నుంచి సిబ్బందితో కలసి గేట్ల వద్ద ఎదురెదురుగా వాహనాలు రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.



భీమవరం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్‌ను అదుపు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు

ఆలయాలకు కార్తిక శోభ

పామర్రు: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయాలు కార్తిక శోభతో కళ కళలాడాయి. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. స్థానిక పుల్లేరు కాలువలో తెల్లవారుజామున స్నానాలను ఆచరించి అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. అంకమ్మ తల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి, స్థానిక విష్ణాలయంలో భక్తులు పూజలు చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని శివాలయాల్లో కార్తిక సోమవారం సందర్భంగా శివాలయాల్లో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కౌతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తిక మాసం రెండో సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం, భైరవపట్నం, శోభనాద్రిపురంలోని విశ్వేశ్వర స్వామి ఆలయాలు, మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



పామర్రు విష్ణాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరులో..

కైకలూరు: కార్తిక మాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కైకలూరు శ్యామలాంబ ఆలయంలో రామలింగేశ్వర, రామేశ్వర, కనకలింగేశ్వర శివాలయాల్లో భక్తులు రద్దీ కనిపించింది. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరు మండలం ఆటపాక కనకలింగేశ్వరస్వామి, కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి, కోరుకొల్లు శివాలయం, కైకలూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో నగరేశ్వరస్వామి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

దీపోత్సవం

మండవల్లి: స్థానిక దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో కార్తీక సోమవారం సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి నక్షత్రమాలిక మహాజ్ఞ కార్యక్రమం, అనంతరం పరమేశ్వరుని భక్తి గీతాలతో భజన చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో బారులు తీరిన భక్తులు



మండవల్లి సాయిబాబా మందిరంలో దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దేవానంద్‌కుమార్‌కు అవార్డు ప్రదానం

మండవల్లి: మండవల్లికి చెందిన డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఏపీలో ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు 19 మందిని ఎంపిక చేయగా వారిలో దేవానంద్‌కుమార్ ప్రథమంగా నిలిచారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి 'మీకోసం'

గుడివాడ టౌన్: ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా మురుగునీటి సమస్య, చెత్త తొలగింపుపై ఫిర్యాదులు అందాయన్నారు. వెంటనే వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు.

జాతీయ స్కిప్పింగ్‌రోప్ పోటీలకు ఎంపిక



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఇందిరారాణి




విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సబాస్టియన్

పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరారాణి పేర్కొన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరంలోని ఎస్‌సీహెచ్‌ఆర్‌ఆర్‌బీ హైస్కూల్లో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన పోటీల్లో వెంకట వర్షిత్ బంగారు పతకం, సాయి షణ్ముఖి రెండు సిల్వర్ మెడల్స్, ఎస్‌కె హుమేరా సిల్వర్‌మెడల్, జె శ్రీరామ్ బ్రాంజ్ మెడల్, భాను చందు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారని తెలిపారు. వీరిలో గోల్డు, సిల్వర్ మెడల్స్ సాధించిన వారు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ రోప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని అసీస్సీ హైస్కూల్ హెచ్‌ఎం సిస్టర్ వలసా సబాస్టియన్ పేర్కొన్నారు. స్థానిక అసీస్సీ హైస్కూల్లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్–14 విభాగం ఫ్రీ స్టైల్లో జీ ఆదర్శ ద్వితీయస్థానం సాధించిందన్నారు. అండర్–14 బాలికల విభాగం ఫ్రీ స్టైల్లో జీ మహిత తృతీయ స్థానం, గ్రూప్ ఈవెంట్‌లో ద్వితీయస్థానం సాధించారన్నారు.

30 మద్యం బాటిళ్ల స్వాధీనం



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదముత్తేవిలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కూచిపూడి పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కూచిపూడి ఎస్ఐ కథనం మేరకు ఆదివారం రాత్రి అందిన సమాచారంతో పెదముత్తేవి సెంటర్‌లో నాగేంద్రబాబు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని గుర్తించారు. నాగేంద్రబాబును అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలి

గుడివాడ టౌన్: ఇటీవల వచ్చిన వరదలతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను గుర్తించడంలో జాప్యం జరిగిందన్నారు. అందరినీ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. వరద వచ్చిన ప్రాంతాల్లో రెండోపంట వేసుకోడానికి ప్రభుత్వం నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై విత్తనాలు అందజేయాలని కోరారు.